సాక్షి ములుగు

గురువారం । 22 । మే । 2025



మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. - 8లో▸



'ఎల్‌సీ' నిర్లక్ష్యంపై సీఎండీ అసహనం

ఎల్‌సీ యాప్ వినియోగంలో నిర్లక్ష్యంపై విద్యుత్ ఇంజనీర్లు, ఆపరేటర్లపై టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.6°/22.3°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సరిహద్దుల సమస్యలు పరిష్కరించాలి

ములుగు రూరల్: భూభారతి పైలట్ ప్రాజెక్ట్‌లో సరిహద్దుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు ముత్యాల రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) మహేందర్‌జీకి బుధవారం ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వెంకటాపురం(ఎం) మండలాన్ని భూభారతి పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రకటించడం హర్షనీయమన్నారు. కానీ సరిహద్దు సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. వెంటనే అధికారులు స్పందించి లింగాపూర్ వద్ద గల భూములపై ఉమ్మడి సర్వే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కంకాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులపై ఎమ్మెల్యేకు వినతి



వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు, ధర్మవరం గ్రామాల మధ్యన నిలిచిపోయిన రహదారి పనులను పూర్తి చేయించాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు ఆయా గ్రామాల ప్రజలు భద్రాచలం వెళ్లి వినతిపత్రం అందజేశారు. అటవీశాఖ అనుమతులు రావాలని చెబుతూ అధికారులు కాలయాపన చేస్తున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఆయన ములుగు కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకుని రహదారి పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గౌరారపు సర్వేశ్వరరావు, నల్లగాసి రమేష్, బంధం కృష్ణ, నూకల రవి ఉన్నారు.

జిల్లా ఉద్యానశాఖ అధికారిగా సంజీవ్‌రావు



ములుగు: జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారిగా సంజీవ్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకరకు ఆయన పూల మొక్కను అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన సంజీవ్‌రావుకు కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడ జిల్లా అధికారిగా విధులు నిర్వహించిన అనసూయ హనుమకొండకు బదిలీ అయ్యారు.

బోర్‌వెల్ వాహనం సీజ్



కన్నాయిగూడెం: మండల పరిధిలోని గంగూడెం గ్రామ పరిధిలోని పోడు భూమిలో బోరు వేస్తున్న బోర్‌వెల్ వాహనాన్ని సీజ్ చేసినట్లు సౌత్ జోన్ రేంజ్ అధికారి అప్సర్ నిషా తెలిపారు. వివరాల్లోకి వెళ్తే..గంగూడెంలో మంగళవారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా బోరు వేస్తున్నారనే సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం ఆ వాహనాన్ని ఏటూరునాగారం రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు వెల్లడించారు.

'సదస్సును విజయవంతం చేయాలి'



ములుగు: ఈ నెల 24న కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నేత, ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జ్ మంద కుమార్‌మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అనుబంధ సంఘాల భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఎంఎస్పీ జాతీయ నాయకుడు పైడిమాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కార్తీక్ పాల్గొన్నారు.

పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



సరస్వతి పుష్కరఘాట్‌కు వస్తున్న భక్తులు



పుష్కరిణికి మొక్కుతున్న దంపతులు



నదికి నీళ్లు ఆరబోస్తున్న యువతి



పుష్కరిణీ.. ప్రణామం!

- ఏడో రోజు కాళేశ్వరానికి తరలివచ్చిన భక్తజనం
- సరస్వతి ఘాట్‌లో స్నానాలు, ముక్తీశ్వరుడి దర్శనం

ఆకాశం అక్షింతలేసినట్లుగా చిరు చినుకులు.. నిశ్శబ్దంగా నది పరుగులు.. కాళేశ్వరం వైపు భక్తుల అడుగులు. వెరసి త్రివేణి సంగమం భక్త జన సందోహమైంది. ఏడో రోజు బుధవారం సైతం భక్తుల ప్రవాహం కొనసాగింది. పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు అంతర్వాహిని సరస్వతి నదికి మొక్కులు చెల్లించుకున్నారు. కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సుమారు లక్షమందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేశారు.

- మరిన్ని వివరాలు, ఫొటోలు 8లో▸

మూడు నెలల ముందే

అభివృద్ధి పనులు పూర్తి

- కలెక్టర్ టీఎస్.దివాకర
- 2026 మేడారం మహాజాతర పనులపై పూజారులతో కలెక్టర్ సమీక్ష



పూజారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర పక్కన పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: 2026లో రాబోయే మేడారం మహాజాతరకు మూడు నెలల ముందుగానే అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో మేడారం జాతర అభివృద్ధి పనులు, పూజా విధానం, తదితర అంశాలపై కలెక్టర్ బుధవారం పూజారులతో సమీక్షించారు. 2026 మేడారం జాతర అభివృద్ధి పనులపై పూజారుల సూచనలు, సలహాలను కలెక్టర్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారంలో పూజారులు సమస్యలను ముందస్తుగా గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. రోడ్ల సమస్యలు ఉంటే తెలపాలని కలెక్టర్ పూజారులను కోరగా కన్నెపల్లి నుంచి కాల్వపల్లి వరకు ఉన్న ఎడ్లబండ్ల రోడ్లను అభివృద్ధి చేస్తే వాహనాలకు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. అలాగే కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలపైకి సారలమ్మను తెచ్చే దారిలో షాపులను రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని వివరించారు. వ్యాపారులు తాగునీటి బాటిళ్లను అధిక ధరలకు విక్రయించడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందుకు పూజారులతో ఓ కమిటీని వేసి ధరల నియంత్రణ చేపడుదామని వివరించారు. కొబ్బరి, బెల్లం లైసెన్సుల జారీ ప్రక్రియను జాతరకు నెల రోజుల ముందే పూర్తి చేయాలన్నారు. అధికారులు గుర్తించి అభివృద్ధి పనులకు అనుమతులు ముందస్తుగా ఇవ్వాలని పూజారులు సూచించారు. గుడి ఆవరణలో పూజా విధానాన్ని సమర్థవంతంగా పూజారులు నిర్వహించుకోవాలని, జాతర విజయవంతానికి అధికారులు పూర్తి బాధ్యత వహిస్తారని కలెక్టర్ తెలిపారు. పూజారులు గద్దెల నుంచి బయటకు, లోనికి వెళ్లే క్రమంలో ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే పోలీసులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఇందు కోసం పోలీసులు, పూజారులు, అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేసి ఐడీ కార్డులను జారీ చేయాలన్నారు. రాబోయే మేడారం జాతర విజయవంతానికి గతంలో జరిగిన లోటుపాట్లను పూజారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, ఎండోమెంట్ అధికారులు క్రాంతి, రాజేందర్, రాజేశ్వర్‌రావు, ఏఓ రాజ్‌కుమార్‌లతోపాటు పూజారులు సిద్ధబోయిన మునేందర్, కాక సారయ్య, కాక వెంకటేశ్వర్లు, చందా రఘుపతి, దబ్బగట్ల గోవర్ధన్, పెనక ప్రబాకర్, పెనక రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోనే పంటనష్ట పరిహారం



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వివిధ కంపెనీల బాండ్ మొక్కజొన్న పంటసాగు చేసి నష్టపోయిన రైతుల బ్యాంక్ ఖాతాల్లోనే నష్టపరిహారం ఆయా కంపెనీల బాధ్యులు చెల్లించేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ దివాకర అన్నారు. మండల పరిధిలోని యోగితానగర్‌లో బుధవారం కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో బాండ్ మొక్కజొన్న పంట సాగు చేసి నష్టపోయిన రైతులతో మాట్లాడారు. కంపెనీ నిర్వాహకులతో కలిసి రైతులకు కంపెనీ నుంచి ఎంత పెట్టుబడి పెట్టారు.. ఎంత పంటనష్టపోయారనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పెట్టుబడి కంపెనీ నుంచి రైతులకు పెట్టుబడి పెడితే పెట్టుబడి పోను మిగిలిన మొత్తం నష్టపరిహారం రైతులకు కంపెనీ చెల్లిస్తుందని వెల్లడించారు.

వరదలతో నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు: వర్షాకాలంలో ఎదురయ్యే వరదలతో ప్రజలకు నష్టం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ దివాకర సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పీఓ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, డీఎస్పీ రవీందర్‌తో కలిసి వరదలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజల రక్షణకు పాటుపడాలన్నారు. జిల్లాలో ఎక్కువగా గోదావరి పరీవాహక ప్రాంతాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ



హాజరైన గిరిజనులు



మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా

- ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: గిరిజన మత్స్యకారుల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చొరవ చూపిస్తున్నట్లు పీఓ చిత్రామిశ్రా అన్నారు. మండల పరిధిలోని ఐటీడీఏ కార్యాలయంలో దర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకంలో భాగంగా బుధవారం మత్స్యకార అభివృద్ధిపై జిల్లాలోని 16 మంది గిరిజన మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు, 33 ఆదివాసీ గ్రామ పంచాయతీల్లోని పెసా మొబిలైజర్లు, గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకున్న గిరిజనులకు 14 రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అందులో సభ్యులు సంఘంగా ఏర్పడి దరఖాస్తు చేసుకునే 6 రకాల పథకాలపై పీఓ వివరించారు. 14 రకాల పథకాల్లో ఏ పథకంపై ఆసక్తి ఉందనేది దరఖాస్తు ద్వారా మత్స్యశాఖకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సల్మాన్‌రాజ్, పాలేరు మత్స్యపరిశోధన విభాగం ప్రధాన శాస్త్రవేత్త శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, గిరిజనులు పాల్గొన్నారు.

తాడ్వాయిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



అకాల వర్షం.. తడిసిన ధాన్యం



రోడ్డుపై చెట్టును తొలగిస్తున్న వాహనదారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: జిల్లాలో బుధవారం పలుచోట్ల కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యంతో పాటు ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడి పరదాలు కప్పినా తడిసిపోయిందని కన్నీటి పర్యంతం అవుతున్నారు. చేతికి వచ్చిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. అలాగే వర్షానికి మేడారం, ఎస్ఎస్ తాడ్వాయి మధ్యలో రోడ్డుపై చెట్టు అడ్డుగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో వాహనాదారులు రోడ్డుపై చెట్టును కొంతమేర పక్కకు తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో పస్రా పీఎస్ బెస్ట్



డీజీపీ నుంచి బెస్ట్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్ ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను పస్రా పీఎస్ బెస్ట్ పోలీస్ స్టేషన్‌గా ఎంపికైంది. ఈ మేరకు బుధవారం డీజీపీ జితేందర్ నుంచి పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ బుధవారం ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఇటీవల అత్యుత్తమ సేవలు కనబర్చిన ఎస్‌హెచ్‌ఓలపై రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల అభిప్రాయ సేకరణ చేపట్టగా రాష్ట్రంలోనే టాప్ 10 పోలీస్ స్టేషన్‌గా జిల్లా నుంచి పస్రా ఎస్సై కమలాకర్ ఒకరుగా నిలిచారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తనకు ఎల్లవేళలా అండగా ఉన్న ఉన్నతాధికారులకు, తనకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలపారు. ఈ సందర్భంగా పస్రా ఎస్సై కమలాకర్‌ను ఎస్పీ శబరీశ్ అభినందించారు. పోలీస్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల అభిప్రాయ సేకరణలో జిల్లా నుంచి పస్రా ఎస్సై కమలాకర్ ఒకరిగా నిలవడం అభినందనీయమని ఎస్పీ ప్రశంసించారు.

కీటకజనిత వ్యాధులపై అప్రమత్తం



సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు

డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు

ములుగు: వర్షాకాలంలో ఎదురయ్యే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు వంటి కీటకజనిత వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు సూచించారు. జిల్లా కేంద్రంలో తన కార్యాలయంలో వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, మానిటరింగ్ సూపర్‌వైజర్లతో వచ్చే వర్షాకాల వ్యాధుల నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు సూచనలు చేస్తూ దోమలు వ్యాప్తి చెందకుండా యాంటీ లార్వాలను నీటి నిల్వ ప్రాంతాల్లో వదలాలన్నారు. పీహెచ్‌సీల వారీగా హైరిస్క్ గ్రామాలను గుర్తించి దోమతెరల పంపిణీ చేపట్టాలన్నారు. ఆర్డీటీ, డెంగీ కిట్లను నిల్వ ఉంచుకోవాలన్నారు. టీమోఫాజ్, మలాథియాన్ పైరిత్రిన్ రసాయనాలను సమకూర్చుకొని దోమల నివారణకు కార్యచరణ రూపొందిచుకోవాలన్నారు. ప్రతీ సబ్ సెంటర్ పరిధిలో శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. వచ్చే మూడు నెలలకు సరిపడా మందులను ముందస్తుగా నిల్వ చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విపిన్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారులు శ్రీకాంత్, చంద్రకాంత్, రణధీర్, ఎస్ఓ స్వరూపరాణి, హెల్త్ ఎడ్యుకేటర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పుష్కర గిరాకీ అంతంతే..

ఆశించిన స్థాయిలో జరగని వ్యాపారం

- ఏడు రోజులుగా విక్రయాలు కొద్ది మొత్తంలోనే..
- పెట్టుబడి చేతికి వస్తుందో లేదో అని చిరు వ్యాపారుల ఆవేదన



గిరాకీ లేక వెలవెలబోతున్న చిరు వ్యాపార దుకాణాలు

కాటారం: పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగిన, ఏ పండుగ రోజు అయిన చిరు వ్యాపారుల ఉపాధికి కొదవ ఉండదు. కాళేశ్వరంలో జరిగే వేడుకలు ఉంటే చాలు జిల్లాతో పాటు వరంగల్, కరీంనగర్, మంచిర్యాల, హైదరాబాద్, మహారాష్ట్రాల నుంచి చిరు వ్యాపారులు ముందుగానే ఇక్కడకు చేరుకొని చిరు వ్యాపారాలు ప్రారంభిస్తారు. పూజాసామాగ్రి, పూసలు, దండల దుకాణాలు, కిచెన్ సామగ్రి, వంట పాత్రలు, చిన్న పిల్లల బొమ్మలు, ఆకర్షించే వస్తువులు, ఇంటి అలంకరణ సామగ్రి, కూల్‌డ్రింక్స్, టిఫిన్ హోటల్స్ లాంటివి ఏర్పాటు చేసి భక్తులకు విక్రయిస్తుంటారు. త్రివేణి సంఘమ స్నానం, ఆలయ దర్శనానికి వచ్చే భక్తులు, మహిళలు, చిన్నారులు చిరు వ్యాపారుల వద్ద తమకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేయడంతో వారికి ఉపాధి లభించేది. గతంలో నిర్వహించిన గోదావరి, ప్రాణహిత పుష్కరాల్లో సైతం పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిరువ్యాపారులు తాము తీసుకొచ్చిన వస్తువులను విక్రయించి నాలుగు పైసలు సంపాదించుకున్నారు. కానీ ప్రస్తుతం సరస్వతీ నదికి కొనసాగుతున్న పుష్కరాల్లో చిరు వ్యాపారాలు ఢీలా పడ్డాయి.

భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని..

చిరు వ్యాపారులు ఆశించిన స్థాయిలో వ్యాపారాలు కొనసాగడం లేదు. ఈ నెల 15న సరస్వతీ పుష్కరాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలు కావడంతో పాటు వేసవి సెలవు రోజులు కావడంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని భావించిన చిరు వ్యాపారులు ముందుగానే కాళేశ్వరం చేరుకొని తమ దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆలయ పరిసరాలతో పాటు గోదావరి ఘాట్‌కు వెళ్లే రహదారి, సరస్వతీ ఘాట్‌కు వెళ్లే దారి, ప్రధాన ప్రాంతాల్లో పలు రకాల చిరు సామగ్రి విక్రయ దుకాణాలను వ్యాపారులు పెట్టుకున్నారు. కానీ ఏడు రోజులుగా వారు ఆశించిన స్థాయిలో వ్యాపారం జరగడం లేదు. మొదటి మూడు రోజులు భక్తుల రాక అంతంత మాత్రంగానే ఉండగా వ్యాపారులకు కనీసం బోణీ కూడా కాలేదు. ఆలయ పరిసరాల్లో భక్తులను ఎక్కువ సమయం ఉండనివ్వకపోవడం, భక్తుల రాకపోకల దారులను మారుస్తుండటంతో వ్యాపారాలు సరిగా జరగడం లేదని చిరు వ్యాపారులు తెలిపారు. కాగా ఇప్పటికే పలువురు చిరు వ్యాపారులు గిరాకీలు లేకపోవడంతో తమ దుకాణాలను ఎత్తేసి వెళ్లిపోయారు. కనీసం తమ పెట్టుబడి అయిన చేతికి వస్తుందో లేదో అని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుష్కరాలు మరో ఐదు రోజులు మిగిలి ఉండటంతో గిరాకీలు ఎలా ఉంటాయో అని వారు దిగులు చెందుతున్నారు.

అనుకున్నంత గిరాకీ లేదు..



మాది ఆలయం ఎదుట కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్ దుకాణం. ఏ పండుగ వచ్చిన, ఏ ఉత్సవం జరిగిన మాకు గిరాకీ చాలా ఉండేది. కానీ ఈ పుష్కరాల్లో గిరాకీ అనుకున్నంత లేదు.

- సురేశ్, చిరువ్యాపారి


ప్రమిదలు వదులుతున్న మహిళలు


తమ చిన్నారులకు పుష్కర స్నానం చేయిస్తున్న కుటుంబ సభ్యులు


చిన్నారులకు పుష్కరస్నానం చేయిస్తున్న యువతులు


దేవుళ్ల చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

నదితీరం.. జనహారం




నదిలో భక్తురాలి పూనకం


నదిలో సెల్ఫీ దిగుతున్న మహిళలు, చిన్నారులు


పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తజనం


పార్కింగ్ స్థలాల్లో నిలిపిన వాహనాలు (విహంగ వీక్షణం)


బురదలో దిగబడిన వ్యాన్‌ను తాడుతో బయటకు లాగుతున్న జేసీబీ


మొక్కుతున్న గిరిజన మహిళ


పుష్కర ఘాట్‌లో ఏర్పాటు చేసిన శివుడి ప్రతిమ వద్ద భక్తులు


ఆటోలు, కార్లు, ఇతర వాహనాల్లో పుష్కరాలకు తరలివస్తున్న భక్తులు


నవరత్నమాలిక హారతి ఇస్తున్న పండితులు

భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని దంపతుల ఆత్మహత్యాయత్నం

తరిగొప్పుల: తాము కొనుగోలు చేసిన భూమిని అమ్మకందారుడు రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తూ తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారని దంపతులు శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం మండల కేంద్రం శివారు ఎన్యానాయక్‌తండాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లికి చెందిన జంగ రవి తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండాకు చెందిన ముడావత్ సంపత్‌నాయక్ వద్ద 2 సంవత్సరాల క్రితం 2 గుంటల భూమిని గుంటకు రూ.3.30 లక్షల చొప్పున కొనుగోలు చేశాడు. అయితే ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా సంపత్‌నాయక్ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. దీంతో రవి పెద్దమనుషులను ఆశ్రయించగా 2 గుంటలకు బదులు మరోచోట 8 గుంటల భూమి ఇవ్వాలని రెండు రోజుల క్రితం తీర్మానం చేశారు. సంపత్‌నాయక్ మరోచోట 8 గుంటల భూమికి హద్దులు చూపించగా ఆ భూమిని రవి మంగళవారం ట్రాక్టర్‌తో దున్నాడు. ఈ క్రమంలో ఏమైందో తెలియదు కానీ బుధవారం ఉదయం రవి తన భార్య, బిడ్డతో సంపత్‌నాయక్ ఇంటికి వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆ దంపతులను వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

'ఎల్‌సీ' నిర్లక్ష్యంపై సీఎండీ అసహనం


వీసీలో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

- డ్యాష్ బోర్డులో వివరాల నమోదులో అలసత్వంపై సీరియస్

హన్మకొండ : ఎల్‌సీ యాప్ వినియోగంలో నిర్లక్ష్యంపై విద్యుత్ ఇంజనీర్లు, ఆపరేటర్లపై టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈ, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. ఎల్‌సీ యాప్ నిర్వహణ, డ్యాష్‌బోర్డులో పారామీటర్ల నమోదు, విద్యుత్ అంతరాయాలపై సమీక్షించారు. విద్యుత్ ప్రమాదాలు తగ్గించేందుకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పించేందుకు ప్రవేశ పెట్టిన ఎల్‌సీ యాప్‌పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అదే విధంగా డ్యాష్ బోర్డులో ఎవరు ఏ పని చేస్తున్నారో నమోదు చేయకపోవడంపై సీరియస్ అయ్యారు. ఇక నుంచి అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్లు రాజు చౌహాన్, అశోక్, జీఎం శ్రీనివాస్, ఎస్ఈలు, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్


మాట్లాడుతున్న జస్టిస్ చంద్ర కుమార్

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం తాత్సారం వీడి వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో శాంతి చర్చల కమిటీ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో జైసింగ్ రాథోడ్ అధ్యక్షతన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జస్టిస్ చంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మధ్య భారతదేశంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరుగుతున్న అంతర్ యుద్ధంలో సామాన్య ప్రజలు, అమాయక ఆదివాసీలు చనిపోతున్నారన్నారు. రాజ్యం తరఫున పోలీసులు సైతం మరణించి మధ్య భారతమంతా నెత్తురోడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మారణహోమాన్ని గమనించిన శాంతి చర్చల కమిటీ చేసిన అభ్యర్థన మేరకు మావోయిస్టు పార్టీ కాల్పులు విరమణ చేసి శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిందన్నారు. కేంద్రం స్పందించకుండా దాడులను మరింత పెంచి సామాన్యులను సైతం చంపేస్తోందని, కాల్పుల విరమణ స్థితిలో ఉన్నవాళ్లను చుట్టుముట్టి చంపడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం శాంతి చర్చల కమిటీ రాష్ట్ర సభ్యుడు సోమ రామ్మూర్తి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, చుంచు రాజేందర్, అనిక్ సిద్ధికి, చిల్ల రాజేంద్రప్రసాద్, బొట్ల భిక్షపతి, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు అబ్దుల్ నబీ, పండుగ శ్రీనివాస్, ఆదినారాయణ, దొమ్మటి ప్రవీణ్ కుమార్, కొండ్ర నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో నోడల్ సెంటర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కోఆర్డినేటర్లుగా జితేందర్, సరిత


జితేందర్


సరిత

కేయూ క్యాంపస్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అనుబంధ సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఇస్రో –ఐఆర్ఎస్) డెహ్రాడూన్ వరంగల్ ప్రాంతీయ కోఆర్డినేటర్లుగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజిక్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జితేందర్, డాక్టర్ అలేటి సరిత నియమితులయ్యా రు. ఈ మేరకు ఇస్రో నుంచి సమాచారం అందిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి బుధవారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ తర్వాత హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఇస్రో ఈ కోర్సెస్‌కు సంబంధించి నోడల్ సెంటర్‌గా ఉందన్నారు. విద్యార్థులు ఈ కోర్సెస్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కాగా, డాక్టర్ జితేందర్, డాక్టర్ సరితను ప్రిన్సిపాల్ జ్యోతి అభినందించారు.

పీజీ సెమిస్టర్ల ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి, పరీక్షల విభాగం అధికారులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్)లో ఈఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పీజీ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి విడుదల చేశారు. పీజీ కోర్సుల్లో మొదటి సెమిస్టర్ల పరీక్షల్లో మొత్తం 85 శాతం, మూడో సెమిస్టర్ పరీక్షల్లో 93శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారని చంద్రమౌళి తెలిపారు. విద్యార్థినులు తమ ఫలితాలను సంబంధిత కాలేజీ వెబ్‌సైట్‌లోగాని లేదా కళాశాలలోని పరీక్షల విభాగంలో తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి సుహాసిని, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు కె. శ్రీనివాస్, పి. రాజిరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేశ్ బాబు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి

- ఇల్లు శుభ్రం చేస్తుండగా ఘటన
- 13 రోజుల్లో మనుమరాలి పెళ్లి.. అంతలోనే విషాదం


నర్సమ్మ (ఫైల్)

హసన్‌పర్తి: మనుమరాలి పెళ్లికి ఇల్లు శుభ్రం చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన హసన్‌పర్తి మండలం జయగిరిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జయగిరికి చెందిన లింగాల నర్సమ్మ(60)కు ఇద్దరు కుమారులు మధు, చంద్రశేఖర్ సంతానం. మధు ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ.. ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందాడు. మధుకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ప్రవీణ్ ఉన్నారు. మధు మృతి తర్వాత అతడి కుటుంబం బతుకుదెరువు నిమిత్తం రాంపూర్ వెళ్లింది. వచ్చే నెల 4న మధు చిన్న కూతురు పెళ్లి జరుగనుంది. జయగిరిలోనే పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఈమేరకు ఇంటిని ముస్తాబు చేయడానికి ప్రవీణ్ జయగిరి వచ్చాడు. బుధవారం నానమ్మ నర్సమ్మతో కలిసి ప్రవీణ్ ఇల్లు శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో దండెంపై దుస్తులు ఆరేస్తున్న క్రమంలో నర్సమ్మ విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన ప్రవీణ్ ఆమెను రక్షించడానికి యత్నించి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనలో నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

- మహబూబాబాద్ జిల్లాలో ఘటన


చేరాలు (ఫైల్)


ప్రవీణ్‌కుమార్ మృతదేహం

కొత్తగూడ/గూడూరు: పిడుగుపాటుకు మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. ఇందులో ఓ గొర్రెల కాపరి, ఓ యువకుడు ఉన్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడ మండలం ఓటాయికి చెందిన ఏళబోయిన చేరాలు(50) గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. రోజువారీగా గొర్రెలను మేపేందుకు బుధవారం కూడా గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండగా గొర్రెలను తోలుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో పిడుగుపడింది. దీంతో చేరాలు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన మైదం సారయ్య కుమారుడు ప్రవీణ్‌కుమార్ (30) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరా అవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లిన ప్రవీణ్.. వర్షం వస్తుండడంతో రోడ్డు పక్కన చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగుపడడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

పుష్కర స్నానం.. పులకించిన భక్తజనం

- సరస్వతీనది పుష్కర స్నానాలకు భక్తుల రద్దీ
- వివిధ రాష్ట్రాల నుంచి భారీగా రాక
- ఎమ్మెల్యేలు వినోద్, అనిరుధ్‌రెడ్డి, సీపీ అంబర్‌కిశోర్‌ఝా, ఎస్పీ శ్రీనివాసరావు పుణ్యస్నానాలు
- ఏడో రోజు లక్షకుపైగా తరలొచ్చిన జనం
- వర్షంతో చల్లబడిన వాతావరణం


కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు

భూపాలపల్లి/కాళేశ్వరం: కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీనది పుష్కరాలకు భక్తులు రోజురోజుకూ భారీగా తరలివస్తున్నారు. బుధవారం ఏడోరోజు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కాళేశ్వరానికి తరలివచ్చారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీనదిలో పుష్కర పుణ్యస్నానాలు ఆచరించి, నదీమాతకు పూజలు చేశారు. పిండప్రదాన పూజలు చేశారు. నదీమాతకు చీర, సారె సమర్పించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. నదిలో దీపాలు వదిలి మొక్కులు చెల్లించారు. ఇసుకలో సైకత లింగాలు చేసి పూజించారు. కాళేశ్వరాలయంలో కాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

ఏడోరోజు లక్షకుపైగా...

హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి రహదారి మీదుగా, పెద్దపల్లి, మంథని, కాటారం మీదుగా వాహనాలు తరలివచ్చాయి. సిరొంచ అంతర్రాష్ట్ర వంతెన గుండా మంచిర్యాల, గోదావరిఖని, చెన్నూర్, ఆసిఫాబాద్, నిర్మల్ నుంచి భక్తులు తరలివచ్చారు. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు డివైడర్లు ఏర్పాటు చేసి నియంత్రించారు. ఆరో రోజు తగ్గిన భక్తులు.. ఏడో రోజు రెట్టింపు సంఖ్యలో తరలివచ్చారు. ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో త్రివేణి సంగమం సరస్వతీనదికి వచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి క్యూలైన్‌లో బారులుదీరారు.

ప్రముఖుల పూజలు..

సరస్వతీనది పుష్కరాల్లో ప్రముఖులు స్నానం ఆచరించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, రామగుండం సీపీ అంబర్‌కిశోర్‌ఝా, ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు పుష్కర స్నానం చేసి కాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. అలాగే, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు కుటుంబ సమేతంగా సరస్వతి ఘాట్ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

వర్షంతో ఇబ్బందులు..

రెండు రోజులుగా ఉక్కపోత, ఎండ తీవ్రతతో తల్లడిల్లిన భక్తులకు బుధవారం సాయంత్రం గంట పాటు కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేశారు. మరో వైపు పుష్కరఘాట్‌లో పార్కింగ్ స్థలాలు బురదమయంగా మారాయి. గాలి దుమారానికి బస్టాండ్ సమీపంలో హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన ఉజ్వల్‌పై రేకు లేచి పడడంతో తీవ్రగాయమైంది. రక్తస్రావం కాగా వెంటనే అంబులెన్స్ ద్వారా మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించారు.

సరస్వతి పుష్కరాలకు వన్ వే

నేటి నుంచి పుష్కరాలు ముగిసే వరకు అమల్లోకి..

భూపాలపల్లి: సరస్వతీనది పుష్కరాలకు వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో నేటి (గురువారం) నుంచి కాళేశ్వరం రూట్‌ను వన్‌వేగా మారుస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి పుష్కరాలు ముగిసే వరకు వన్ వే అమల్లో ఉంటుందన్నారు. హైదరాబాద్, వరంగల్, ఆపై ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్, అన్నారం స్తూపం మీదుగా చంద్రుపల్లి, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలని, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి మహదేవపూర్ మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లాలని తెలిపారు. అలాగే, కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు మంథని, కాటారం, మహదేవపూర్, అన్నారం స్తూపం మీదుగా చంద్రుపల్లి, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలని, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి మహదేవపూర్ మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లాలని సూచించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ నుంచి వచ్చే వాహనాలు సిరొంచ, అంతర్రాష్ట్ర బ్రిడ్జి మీదుగా కాళేశ్వరం చేరుకుని, తిరుగు ప్రయాణంలో కూడా అదే రూట్లో వెళ్లాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు.